

# బూజుపట్టిన వ్యక్తిత్వం

చింతలపూడి రాజేశ్వరి

"ఒరేయ్ రామూ!....నిన్నే!....చెవిటి మొద్దూ, ఇలా రా". వీధిగుమ్మం దాటబోతున్న రాము జారిపోతున్న లాగు పైకి లాక్కుని బిక్కుబిక్కుమంటూ వెనక్కి తిరిగి గుమ్మంలోకి వచ్చి నిలబడ్డాడు.

"ఎక్కడికిరా?"

"బడికి నాన్నా!"

"వెళుదువుగాని లే! లోపలికెళ్ళి అమ్మతో కాఫి పంపించమని చెప్పు."

విశ్వనాథం మళ్ళీ పేకాటలో మునిగిపోయాడు. రాము వెనక్కితిరిగి లోపలికి పరిగెత్తాడు "అమ్మా! అమ్మా!" అంటూ.

తలగడలో మొహం దాచుకుని పడుకునివున్న అశ్విని చప్పున తలెత్తింది, "ఏం రామూ?" అంటూ.

"నాన్న కాఫీ పంపించమన్నారు."

"లేదని చెప్పు కాఫీ!" కటువుగా అంది అశ్విని. రాము తల్లికేసి ఒక్కసారి చూసి ఏమనుకున్నాడో ఏమో వెనక్కి తిరగబోయాడు. అశ్వనే ఆపింది. "రామూ! నువ్వు చెప్పొద్దులే. స్కూల్కెళ్ళిపో."

రాము వెళ్ళిపోయాడు.

అశ్విని మంచంమీద కూర్చుంది. రాబోయే తుపానుగురించి ఎదురుచూస్తూ. మంచంమీద పక్కనే లక్ష్మి నిద్రపోతూంది. అశ్విని ఆ పిల్లకేసి చూస్తూ... పీపు నిముర్తూ వుండిపోయింది, పదేళ్ళనుంచీ యిదే జీవితం!

అతనికీ — అతని స్నేహితులకీ కాఫీలు, టిఫిన్లు యివ్వటంతోనే తన

జీవితం వెళ్ళిపోతోంది.

పేకాట ఆడ్డానికి యీ యిల్లొక కేంద్రం,

వందలు పోతూవుంటాయి. ఏనాడయినా పదులు వస్తూవుంటాయి. ఆ వచ్చేవి—విశ్వనాథం సిగరెట్లకి, సినిమాలకి, కారాక్లీలకి చాలవు.

"ఏం? గంటక్రిందట చెప్తే యింత వరకు అంతులేదు కాఫీ?" వురుము వురిమినట్టుగా విశ్వనాథం గర్జింపు గుమ్మంలోంచి.

అశ్వని లేచి నిల్చుంది. నెమ్మదిగా "లేదు" అంది,

"ఏం? ఎందుకని లేదు?"

"కాఫీపొడి లేదు"

"ఏం ఎందుకని లేదు? మొన్ననేగా పొను కాఫీపొడి తెచ్చిందీ!" విశ్వనాథం అరుస్తున్నాడు.

అశ్వనికి సిగ్గుతో నరాలు తెగిపోతున్నట్టు అన్పించింది.

"మొన్న కాదు కాఫీపొడి తెచ్చింది, వారం క్రిందట!"

"నోర్మూయ్." అశ్వని దవడ వూడి కింద పడుతుందేమో అనిపించింది.

విశ్వనాథం వెళ్ళిపోయాక అశ్వని ఏడ్చింది.

* *

"రాధా!....పదేళ్ళనుంచీ యిదే నా జీవితం రాధా! అతను ఎలా ఆడిస్తే అలా ఆడుతా! అతను నోరు విప్పమంటే విప్పాలి. అతని సమక్షంలో ఏడవకూడదు. పదిమందిలో నవ్వకూడదు.

పేకాట రోజూ ఆడతారు. అందుకు మా యిల్లే ముఖ్యస్థావరం. అందులో యీాయనకేమీ రాదనుకో.

రాధా, పసివాళ్లిద్దర్నీ చూస్తుంటే జాలి వేస్తోంది. పాపం, వాళ్ళకి ఆ హారికి కాఫీ అలవాటుగూడా లేదుగా! రాము నోరు తెరచి ఏనాడూ కాసీ అడగడు. నేనే యిస్తూవుంటాను. నాకు చాటుగా డబ్బు ఎక్కడిదని ఆశ్చర్యపోతున్నావా, అదీ....అప్పుడప్పుడు వాళ్ళకో వంద, వీళ్ళకో వంద అప్పడాలు వొత్తియిస్తూ వుంటాను. ఆ సంగతి అతనికి తెలీదు, అమ్మో! ..ఎంత నామర్దా!!!

రోజు కాకపోయినా వారానికి కనీసం నాలుగుసార్లు అయినా సినిమాకెడతారు. అర్ధరాత్రి కొంచెం తలుపుతీయటం ఆలశ్యం అయితే, అంతులేని విసుగు! గంటలు గంటలు సినిమాలో కూర్చొచ్చుగానీ ఓ అయిదు నిముషాలు వారికి గుమ్మంలో నిలబడలేరు? లేరు!

నాకు చీరలున్నాయో లేదో అతనికి పట్టదు. అయినా శుభ్రంగా వుండాలి. ఎందుకంటే పేకాట ఆడేటప్పుడు అతనికీ అతని ఫ్రెండ్సుకీ కాఫీలు అందివ్వాలి గదా! అందుకని. అర్ధరాత్రయినా, అపరాత్రయినా అతను పిలిస్తే .... బలికి మేకలా అతన్ననుసరించాలి గదా! రాధా యిదే నా జీవితం! ఇదే నా జీవితం!

లోకంలో అందరు మొగాళ్లూ యింతేనా? కాదు ...కాదు. అంతా యింతే అవుతే ప్రపంచం ఏనాడో మునిగిపోయి వుండేది. రాధా, నువ్వు నా ఫ్రెండువి. ఆ ఆవేదన నీకు విప్పి చెప్తున్నా. ఓదార్పు మాటలు నాకు అవసరంలేదు. నాకు ఏదో పరిష్కారం కావాలి. పదేళ్లుగా యీ జీవితం విసుగు పుడుతోంది. నేను లేక పోయినా అతనికి యిబ్బంది ఏమీలేదు. నాకు అతనొక్కడే మొగవాడు కానీ— అతనికి చాలామంది ఆడవాళ్లు వున్నారు. నేను లేకపోయినా బెంగెట్టుకు చచ్చేవాళ్లు లేరు. నీనుంచి జాబుకోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తూ—

అశ్వని.

ప్రియమైన అశ్వనీ,

నీ వుత్తరం అందింది. అది చదివాక ఎలా జాబు రాయాలో, నిన్ను ఎలా ఓదార్చాలో నాకేం తోచటంలేదు. నాయీ జవాబు నాకే తృప్తికరంగాలేదు. నువ్వు నా ముందు పరచిన ఆ విషాదగాథ కేవలం నీ వొక్కదానిదేకాదు. అది నారీ లోకానికే సమస్య. నూటికి తొంభై మంది గృహిణుల ఆర్తనాదాల మిశ్రమం అది.

అశ్వనీ! ఆడది శక్తిస్వరూపిణి అనీ, త్యాగమూర్తి అనీ....యివన్నీ మొగాళ్ళు చెప్పే కల్లబొల్లి కబుర్లు. ఆడదానిలో అసలైన స్వభావాన్ని, వ్యక్తిత్వాన్ని తొక్కిపెట్టి....ఆడదాని మంచితనాన్ని ఆసరాగా తీసుకుని నీ మొగుడులాంటి మొగళ్ళు వుండబట్టే నేటి మన సంఘం యింత ఘోరంగా తయారవుతోంది. ఎంతసేపూ తను, తన బిల్లాలు. తప్ప కట్టుకున్న భార్య ఒక మనిషేననీ దానికి పొట్టనిండా తిండి, ఒంటినిండా బట్టా కావాలనీ....ఆడదంటే తను ఎటు తిప్పితే అటు తిరిగే మరకాదనీ, రక్త మాంసాలున్న ఓ ప్రాణేననీ. యీ మొగాళ్ళకు తెలీదు. తెలిసినా అక్కరలేదు.

యుగాలు మారినా మొగాడి సంకుచిత తత్వం మారదు. ఇంకో వెయ్యి తరాలు మారుతాయిగాక మొగాడు అంతే! తన అడుగులకు మడుగుతొత్తే ఆడదికావాలి, తను ఎటుతిరిగినా ఇంటికొచ్చేసరికి "ప్రాణనాథా!" అంటూ తలుపుతీసే ఆడది కావాలి. పీకల్దాకా తాగివొస్తే, డొక్కలో పెడీపెడీ తన్నించుకుంటూ, బూట్లు విప్పే ఆడదికావాలి. పిలిచినప్పుడల్లా పక్కలోకి వచ్చే ఆడది కావాలి.

అశ్వనీ! మొగాళ్ళంతా ఒక్కలా వుంటారని నే ననను. కానీ మన దౌర్భాగ్యమేమిటంటే ఎక్కువగా వాళ్ళే మనకు లభ్యం అవుతున్నారు. (లతగారన్నట్టు, కట్టుకున్న భార్య కేవలం సత్యనారాయణ వ్రతం పీటలమీదికే పనికి రావటం ఎంత ఘోరం! ఎంత అసహ్యం!)

నువ్వు రాసిన ప్రతి అక్షరంలోనూ నీ ఆవేదన ప్రతిఫలించింది నేను నీకెలాంటి పరిష్కారం చూపించగలను,

కానీ.... సాటి ఆడదానిగా నాకు చాతనయిన సాయం చేస్తాను. అశ్వనీ! నూవ్వూ నేనూ ప్రాణ స్నేహితులం ఐదునుంచి కలిసి చదివాము. నువ్వు బొత్తిగా అక్షర జ్ఞానం ఏమీ లేనిదానివి కావుగా ఏదో.... ఎస్. ఎస్. ఎల్. సి. అయినా అయిందని పించావు. వుద్దేశం అంటూ లేకుండా ఆ నాడు చదివినా నీ కది యీ విధంగా నయినా వుపయోగపడితే ఆ చదువు కదే సార్థకత!

"అశ్వనీ! నువ్వు వెంటనే బయల్దేరి వొచ్చెయ్. ఇక్కడ నేను పనిచేస్తున్న స్కూల్లోనే ఒక టీచర్ ప్రసవానికి వెళ్ళింది. హెడ్‌మిసెస్‌కి నేనంటే కాస్త మంచి యింప్రెషన్‌వుంది. నిన్నుగురించి ఆవిడతో చెప్పి ఎలాగయినా వొప్పించు తాను. పిల్లల్ని తీసుకుని బయల్దేరి వొచ్చేయ్. యిద్దరం కలిసి యిక్కడే వుందాము. అమ్మకీ చెప్పాను. నీ గురించి చెప్పి ఎలాగో వొప్పించగలను. నువ్వు ట్రెయినింగ్ అవలేదనుకో. అయితే మాత్రం ఏం? ఈ వుద్యోగం అయినా పర్మినెంట్ కాదుగా. ఆవిడ వొచ్చాక ఇంకోటి చూసుకోవచ్చు.

"అశ్వనీ! నువ్వు వెంటనే బయల్దేరి వొచ్చెయ్. ఆడదంటే కేవలం మొగాడి బూటులో మేజోడు కాదని నిరూపిద్దాం. మొగాడు లేకుండా ఆడది బతక్కలదని చాటిద్దాం. ఈ మహాయజ్ఞానికి మనమే ప్రారంభకులం అవుదాము.

నీ కోసం ఎదురుచూసే—రాధ.

రాధ, యీ వుత్తరం రాసిన నెల వరకు ఎలాంటి సమాధానమూరాలేదు కానీ కొన్నాళ్ళకు ఓ వుత్తరం మాత్రం రాధ చేతుల్లో పడింది.

ప్రియమైన రాధా!

నీ వుత్తరం చదివాక నాలో అంతు లేని ఆవేశం కరిగింది. నిజమే కానీ అది కానీ కొద్దిసేపే. తర్వాత ఆలోచిస్తుంటే ఎంతో నీరసం అనిపిస్తోంది. ఏదో అర్థం గాని బలహీనత నన్ను కృంగదీస్తోంది.

రాధా! నేను భారత స్త్రీని. సాంప్రదాయాలనే వూబిలో పీకల వరకు కూరుకుపోయివున్నాను. నన్ను బయటికి లాగాలని ప్రయత్నించటమంత మూర్ఖత్వం ఇంకోటి లేదు.

"రాధా! నా బలహీనతకి నన్ను అసహ్యించుకున్నాసరే కానీ.... నా సంగతి వొదిలెయ్యి చెట్టునుంచి రాలడానికి సిద్ధంగా వున్న ఆకుని. కానీ నాకు నా భర్త యిచ్చిన పిల్లలు.... వాళ్ళ గతేమిటి రాధా! నాతోపాటు వేరే జీవితం పంచుకుంటారు. నిజమే కానీ రేపు వాళ్ళ అమూల్యమయిన భవిష్యత్తులో తండ్రి ఏడి అని నిలవేసి అడిగితే ఏమని చెప్పను? లోకం ఈ పిల్లల తండ్రి ఎవరని అడిగితే ఏమని చెప్పను?.... ఒదిలేసి వచ్చానని చెప్పనా? నా భర్త నన్ను తన్నుతుంటే అతన్తో కాపురం ఇష్టంలేక స్వతంత్రంగా విడాకులతో బతుకుతున్నా

వని చెప్పనా? ఈ దిక్కుమాలిన భారత దేశంలో విడాకులు అనే శాసనంకింద విడిపోవటంకంటే....గన్నేరుపప్పు తిని హాయిగా చావటం మేలు;

రాధా! భర్త పీడన ఎలాగో యిప్పటి వరకు సంఘంలో తలఎత్తుక తిరగ్గలుగుతున్నాను. ఆ ఆశ్రయమే వదులుకున్నాక .... స్వతంత్రంగా బతుకుతున్న ఆడదాన్ని చూసి పట్టించుకోకుండా వొదిలేసే రోజులా యివి! రాధా, రాము మొగవాడు. వాడిగురించి నాకు బెంగలేదు. బూట్ పాలిష్ చేసయినా బతుకుతాడు. కానీ లక్ష్మి....ఆడపిల్ల! దానికి పెళ్ళి ఎలా అవుతుంది! భర్తని వొదిలేసి వొచ్చిన ఆడదాని కూతుర్ని చేసుకోడానికి ఎవరు ముందుకు వస్తారు;

నా పిల్లల భవిష్యత్తు కోసమయినా నేను అతనితో రాజీపడక తప్పదు. అతని బూట్‌లో మేజోడులా అణిగిమణిగి వుండక తప్పదు. నా యీ బలహీనతకి క్షమించు రాధా! పోనివ్వు.... నా జీవితం యిలా వెళ్ళిపోనివ్వు అతను పడేసిన అన్నం తింటూ, అతను యిల్లు చేరితే తలుపుతీస్తూ, అతనికీ, అతని స్నేహితులకు కాఫీలు అందిస్తూ .... యిల్లాగే....యిల్లాగే ఏదో ఒకనాడు చచ్చిపోతాను.

రాధా! అరటి చెట్టుకి ఆడదాని జీవితాన్ని పోల్చిన కవి ఎవరోకానీ .... ఆయన కాళ్ళు కళ్ళకద్దుకోవచ్చు. ఎంత నిజం అది! అరటిచెట్టు ఒకసారి గెల వెయ్యగానే యింకదాని అవసరం తీరిపోతుంది. ఇంక దాని ఆయ్యుసు తీరిపోతుంది. ఆడదీ అంతే! పెళ్ళి చేసుకోకుండా, ప్రతిపురుషుడికీ పరాయిగానే వుండే ఆడది ఎంత అదృష్టవంతురాలు! ఎంత ధన్యురాలు! ఇప్పుడు నేను చెయ్యగలిందేమీలేదు. మావాళ్లు చేసినదానికీ, నేను పుస్తె కట్టించుకున్న దానికీ అనుభవించాల్సిందే. కానీ నా ఆఖరి క్షణంలో గూడా నేను ఒకటి మాత్రం భగవంతుడిని ప్రార్థిస్తాను. ఏమిటంటే నా కొడుక్కి తండ్రి పోలిక రాకూడదు. వాణ్ణి కట్టుకుని మరో ఆడది తన దౌర్భాగ్యానికి ఏడవకూడదు.

రాధా! నేను ఏదేదో వాగానుగదూ. అంతా మర్చిపో. నా జీవితానికి పరిష్కారం అంటూలేదు. రంగు వెలసి విరగటానికి సిద్ధంగా వున్న మట్టిబొమ్మని. ఆ దుమ్ము దులిపి కొత్త రంగులు పులమాలనుకుంటం అనవసరం. స్నేహితురాలి ఆవేదనని అర్థం చేసుకుని సానుభూతితో తోడ్పడాలని ప్రయత్నించిన నీకు ఎంతో కృతజ్ఞురాల్ని.

మృత్యువొక్కటే నాకు పరిష్కారం!

నీలోని మానవతకో నమస్కారం!

"నీ అశ్వని."